# ప్రజా మహాత్మ

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు





మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న హైదరాబాద్‌లో మాంసం దుకాణాలు బంద్


ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 34 | గురువారం | 01 - 10 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2


## పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదన్న కేటీఆర్
- నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ అవుతానా? అని ప్రశ్న
- తదుపరి సీఎం కేసీఆర్ అని ధీమా

**హైదరాబాద్ :**
పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ - మిగతా 2 లో

### సమస్యల పరిష్కారానికి కేంద్రం వద్దకు

## ఎన్నిసార్లయినా వెళ్తాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మూడు శాతం ఉద్యోగులు 97 శాతం ప్రజలకు సేవ చేయడం శ్రమతో కూడిన పని అని రేవంత్ రెడ్డి తెలిపారు
- కరీంనగర్ సమీకృత కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు



**హైదరాబాద్ :**
పేదల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ కార్యాలయం ఉపయోగపడాలని, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే ఉద్యోగులే ప్రభుత్వ ప్రతినిధులని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సహాయం కోసం వచ్చిన వాళ్లను మన కుటుంబసభ్యుల్లా చూడాలని కోరారు. కరీంనగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. కరీంనగర్ సమీకృత కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. కరీంనగర్ కలెక్టరేట్ నూతన భవన సముదాయం ప్రారంభంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.అందరి సహకారంతోనే సమస్యలు పరిష్కరిస్తూ ప్రభుత్వం ముందుకెళ్తోందన్న సీఎం, ఇంకా సమస్యలున్నాయని ప్రజలకు సేవలందిస్తూనే సమస్యలు పరిష్కరించుకోవాలని ఉద్యోగులను ఆదేశించారు. 10.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగులే 4 కోట్ల ప్రజలకు సేవలందిస్తున్నారని, మూడు శాతం ఉద్యోగులు 97 శాతం ప్రజలకు సేవ చేయడం శ్రమతో కూడిన పని అని తెలిపారు. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చినా, చెడు పేరు వచ్చినా ప్రభుత్వ ఉద్యోగుల వల్లేనని స్పష్టం - మిగతా 2 లో

## కాంగ్రెస్‌ను నిలదీసిన కవిత



- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై దుమారం
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన
- రెండు స్థానాల్లోనూ రెడ్డి సామాజిక వర్గానికే అవకాశం
- ఇది సామాజిక అన్యాయమంటూ కవిత తీవ్ర విమర్శ

**హైదరాబాద్ :**
తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు - మిగతా 2 లో



## హైదరాబాద్‌లో ప్రతి 100 మందికి 70 వాహనాలు

- గత్యంతరం లేకే వాహనాలు కొంటున్నారు – జయప్రకాశ్ నారాయణ
- హైదరాబాద్ ట్రాఫిక్‌పై లోక్‌సత్తా అధినేత జేపీ కీలక వ్యాఖ్యలు
- ప్రపంచంలోని సంపన్న నగరాల కంటే హైదరాబాద్‌లోనే ప్రైవేట్ వాహనాలు ఎక్కువ
- ఫస్ట్, లాస్ట్ మైల్ కనెక్టివిటీ లేకపోవడంతోనే ప్రజలు సొంత వాహనాలను వాడుతున్నారని వెల్లడి
- ప్రతి 100 మందికి 70 వాహనాలు ఉండటం ఆందోళనకరమన్న జయప్రకాశ్ నారాయణ

**హైదరాబాద్ :**
హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ తీవ్రమవుతున్న ట్రాఫిక్ రద్దీ, వాయు కాలుష్యంపై లోక్‌సత్తా పార్టీ అధినేత, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ కీలక విశ్లేషణ - మిగతా 2 లో

## అక్టోబర్2 నుంచి ‘సేవ్ డెమోక్రసీ’ యాత్ర




- ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసిన ఇండీ కూటమి
- అక్టోబర్ 6న ఈసీ కార్యాలయం వరకు విపక్ష ఎంపీల ప్రదర్శన
- విపక్ష ఎంపీలు ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపిన మల్లికార్జున ఖర్గే
- సర్ ప్రక్రియకు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసిన కూటమి

**ఢిల్లీ :**
ఓటరు జాబితా సవరణలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఈ మేరకు ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసింది. యువత, ఎన్జీవోలను కలుపుకుని అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలు చేపట్టనున్నారు. అలాగే జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయనున్నారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయం - మిగతా 2 లో

## ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు



- సీఎం రేవంత్ రెడ్డి అభినందన
- ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చర్ చికితకు రెండు స్వర్ణాలు
- చికితను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంస
- ఈ విజయంతో 2028 ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన చికిత
- పెద్దపల్లి జిల్లాకు చెందిన క్రీడాకారిణి చికిత

**హైదరాబాద్ :**
ఆసియా క్రీడల్లో ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటిన తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితా రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. తన అద్భుత విజయంతో చికిత తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని, రాష్ట్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిందని కొనియాడారు.ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తన ‘ఎక్స్’ ఖాతాలో పోస్ట్ చేస్తూ, చికిత పట్టుదల, నిరంతర సాధన, దృఢ సంకల్పం యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఆమె ప్రతిభను గుర్తించి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక - మిగతా 2 లో

## ఏపీలో కమ్మ, క్రైస్తవ సామాజికవర్గాలదే అధికారం



- విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు
- టీడీపీ, వైసీపీలకు ప్రత్యామ్నాయం అవసరమన్న విజయసాయి
- విశాఖ రాజధాని విషయంలో జగన్ యూటర్న్ తీసుకున్నారని విమర్శ
- అమరావతే ఏపీకి రాజధాని అని వ్యాఖ్య
- అమరావతిని కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి చేయాలని సూచన
- లిక్కర్ కుంభకోణంతో తనకు సంబంధం లేదని స్పష్టీకరణ

**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కేవలం కమ్మ, క్రైస్తవ సామాజిక వర్గాలకే - మిగతా 2 లో

### ‘సర్’ పై వివాదం వేళ..

## ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం




- కొత్త ఓటర్లకు తల్లిదండ్రుల వివరాలు అక్కర్లేదు
- తాతలు, నానమ్మల వివరాలూ అవసరం లేదు
- సర్ పూర్తయిన చోట అదనపు డిక్లరేషన్ అవసరం లేదన్న ఈసీ
- సర్ కొనసాగుతున్న చోట పాత నిబంధనే
- ఫారం–6 ద్వారా కొనసాగనున్న నిరంతర నమోదు

**ఢిల్లీ :**
కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వారికి ఎన్నికల సంఘం (ఈసీ) కీలక - మిగతా 2 లో

## పేదల సంతోషమే నిజమైన అభివృద్ధి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం స్వర్ణాంధ్ర సాధనకు తొలి మెట్టు
- పేదలందరూ ఆనందంగా ఉంటే అదే నిజమైన అభివృద్ధి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు
- అలాంటి అభివృద్ధి సాధించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు
- ప్రతి పేదవారికీ గృహకల్పనతో శాశ్వత భద్రత కల్పించడాన్ని బాధ్యతగా తీసుకున్నామన్నారు



**అమరావతి :**
సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి, నిరంతరం జరగాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడులు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నామని పంటలకు నీళ్లు ఇస్తున్నామని తెలిపారు. రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌కు రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఏర్పాటు చేసిన ‘పేదలకు పట్టాభిషేకం’ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు.అంతకుముందు చంద్రబాబు వేదికపై ఏర్పాటు చేసిన స్టేజ్‌పై నడిచి ప్రజలకు అభివాదం చేశారు. స్టేజ్‌పై సీఎం వెంట మంత్రులు సత్యకుమార్, మనోహర్ ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో జెట్ స్పీడ్‌తో దూసుకెళు _న్నామని చెప్పారు. ఇవాళ 26,401 మందికి పట్టాలు ఇస్తున్నట్లు వివరించారు. ఇటీవల విశాఖలో, మంగళగిరిలో - మిగతా 2 లో

## రైతుబజార్లలో రూ.35కే కిలో ఉల్లి

### పంపిణీ ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

- ఉల్లిపాయలను రైతుబజార్లలో సబ్సిడీపై రూ.35కే అందించే కార్యక్రమానికి పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శ్రీకారం
- విజయవాడలోని ఏపీఐఐసీ రైతుబజార్‌లో రాయితీ ఉల్లి కౌంటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు



**అమరావతి :**
పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల నుంచి సామాన్యులకు ఉపశమనం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. బహిరంగ మార్కెట్లో కిలో రూ.60 నుంచి రూ.70 వరకు పలుకుతున్న ఉల్లిపాయలను, రైతుబజార్లలో సబ్సిడీపై రూ.35కే అందించే కార్యక్రమానికి పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శ్రీకారం చుట్టారు. విజయవాడలోని ఏపీఐఐసీ రైతుబజార్‌లో రాయితీ ఉల్లి కౌంటర్‌ను లాంఛనంగా ప్రారంభించి, లబ్ధిదారులకు ఉల్లిపాయలను పంపిణీ చేశారు.ఆధార్ ఉంటేనే ఉల్లి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రివమండలి ఉప సంఘం - మిగతా 2 లో

# ఘనంగా పోషణ్ మాసం కార్యక్రమం



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 30 (ప్రజా మంటలు):** మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పద్మారావు నగర్ హమాలీ బస్తి అంగన్వాడి కేంద్రంలో పోషణ్ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ వేడుకలో భాగంగా పలువురు గర్భిణీ స్త్రీలకు సంప్రదాయబద్ధంగా సీమంతాలు జరిపారు. అలాగే ఆరు నెలలు నిండిన చిన్నారులకు ప్రాజెక్ట్ అధికారి ఆధ్వర్యంలో అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో స్వప్న, ప్రాజెక్ట్ సూపర్వైజర్ దివ్య, కింద బస్తీ దవాఖాన డాక్టర్ రాజ్‌కుమార్, ఏఎన్ఎం సంధ్యలతో పాటు ప్లాన్ ఇండియా ప్రతినిధి లక్ష్మి, ప్రథమ్ ఎన్జీవో ప్రతినిధి నవనీత, ఆశా వర్కర్లు, హమాలీ బస్తీ అంగన్వాడి కేంద్రం టీచర్ లు కులుసుమ్, జానకి, తోటి అంగన్‌వాడీ టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళలు, పిల్లల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు.

# బుగ్గారం ప్రెస్ క్లబ్ నూతన కార్య వర్గం ఏకగ్రీవ ఎన్నిక

-అధ్యక్షుడిగా దూడ జీవన్ ప్రధాన కార్యదర్శిగా జైషెట్టి రాకేష్



**ధర్మపురి, సెప్టెంబర్ 30 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లాలోని బుగ్గారం మండల కేంద్రంలో గల స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ యందు బుధవారం రోజు జరిగిన సమావేశం నందు బుగ్గారం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎౌజేఖీ తెలంగాణ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు జగిత్యాల జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎన్నాం కిషన్ రెడ్డి నాయకత్వంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇట్టి కార్యక్రమ నిర్వహణ శుభ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసి, పాత్రికేయుల సమస్యలు, హక్కుల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యలను వెలుగు లోకి తీసుకురావడంలో ఐక్యంగా పని చేయాలని వారు నిర్ణయించారు. నూతన కార్య వర్గ అధ్యక్షుడిగా దూడ జీవన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా చిర్ర సత్యం, ఉపాధ్యక్షులుగా వెల్గటూర్ ప్రేమ్ కుమార్, దోంతమల్ల సురేష్, ప్రధాన కార్యదర్శిగా జైషెట్టి రాకేష్, కార్యదర్శులుగా మేడి పల్లి గంగాధర్, నక్క శంకర్ సంయుక్త కార్యదర్శిగా భోమ్మెన శ్రీ హరి, ప్రచార కార్యదర్శిగా బత్తిని తిరుపతి, కార్య వర్గ సభ్యులుగా జానకి రామ్, తోవిటి వెంకట స్వామి, అవ్వ సాయి కృష్ణ, నక్క సునీల్, చిర్ర లక్ష్మణ్ లను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్టు వారు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. బుగ్గారం మండలం లోని పాత్రికేయులందరి ఐక్యతకు కృషి చేస్తామని, పాత్రికేయుల హక్కుల పరి రక్షణతో పాటు ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, కమిటీ సభ్యులు, జర్నలిస్ట్ మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లి మండలం కేంద్రం లో బీఆర్ఎస్ నాయకులు ముందస్తు అరెస్టులు పోలీస్‌స్టేషన్‌కు తరలింపు




**గొల్లపల్లి 30సెప్టెంబర్ ప్రజా మంటలు :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో గొల్లపల్లి మండలంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. సీఎం పర్యటనకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు తెల్లవారుజామునే అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు సీఎం పర్యటన సందర్భంగా భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే పోలీసుల తీరుపై బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "సీఎం వస్తున్నారని ముందే తెలుసు.. కానీ సర్పంచులకు కూడా ఉదయం కార్యక్రమాలు ఉంటాయని పోలీసులకు తెలియదా?" అంటూ పలువురు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. సీఎం పర్యటనకు ముందు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చలు, ప్రజా సమస్యలపై వినతులు ఉంటాయని భావించిన ప్రజాప్రతినిధులకు... పోలీస్‌స్టేషన్ తరలించారు ప్రజాపాలన? అంటే ఇదేనా అని బీఆర్ఎస్ నాయకులు కచ్చు కొమురయ్య, కనుకుంట్ల లింగారెడ్డి గంగారెడ్డి, భోజనపు శ్రీనివాస్, తాండ్ర కిరణ్, జలంధర్, రత్నం, అరెస్టు చేసుడు ఇదేమి పాలన అని ప్రశ్నించారు

# చేసిన సేవలే శాశ్వత గుర్తింపునిస్తాయి

-గాంధీ ఆస్పత్రిలో జూనియర్ అసిస్టెంట్ గంట ప్రభాకర్‌కు ఘన వీడ్కోలు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 30 (ప్రజా మంటలు):** ఉద్యోగ కాలంలో సంస్థకు, తోటి ఉద్యోగులకు అందించిన నిస్వార్థ సేవలే శాశ్వత గుర్తింపును తెచ్చిపెడతాయని వక్తలు పేర్కొన్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన గంట ప్రభాకర్ యాదవ్‌కు బుధవారం తోటి ఉద్యోగులు, అధికారుల సమక్షంలో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ అభినందన సభలో ప్రభాకర్ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సహచరులు మాట్లాడుతూ, ప్రభాకర్ తన సర్వీస్ కాలంలో విధుల పట్ల అంకితభావంతో వ్యవహరించడమే కాకుండా, సుదీర్ఘకాలం పాటు యూనియన్ అధ్యక్షుడిగా పనిచేస్తూ తోటి ఉద్యోగుల సంక్షేమం కోసం అలుపెరగని కృషి చేశారని కొనియాడారు. సిబ్బంది సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి నాయకత్వం వహించారని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ నాన్-గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టీఎన్జీవోస్) గాంధీ హాస్పిటల్ యూనిట్ ప్రతినిధులు ఆయనకు వీడ్కోలు పలుకుతూ, శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ టి. ఉషారాణి, ఆర్ ఎం ఓ లు జయకృష్ణ, యోగేంధర్, వెంకట్ యాదవ్, డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్ కుమార్, టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ సెక్రటరీ డాక్టర్ ముజీబ్ హుస్సేన్, గెజిటెడ్ యూనియన్ ప్రెసిడెంట్ కృష్ణ యాదవ్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, గాంధీ యూనిట్ సెక్రటరీ ప్రసన్నానంద్, నాయకులు కలీమ్, జనార్ధన్, సరళ, మక్సూద్, రహీమ్, సత్యనారాయణ, శ్రవణ్ , విశ్వనాథ్ ,భావన, సోనియాతో పాటు ఆసుపత్రి ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లకు ఘన సన్మానం

జగిత్యాలలో అంగన్ మిలన్ సేవా కార్యక్రమం



**జగిత్యాల, సెప్టెంబర్ 30 (ప్రజా మంటలు): :** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుపరిపాలన, సేవా సంకల్పంలో భాగంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా జగిత్యాల పట్టణంలోని ఉప్పరిపేట సెంటర్‌లో అంగన్ మిలన్ సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లను ఘనంగా సన్మానించి, వారు అందిస్తున్న సేవలను నాయకులు కొనియాడారు. మహిళలు, చిన్నారుల సంక్షేమంతో పాటు ఆరోగ్యం, పోషకాహార పరిరక్షణలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణకు వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని, వారి కృషిని గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దురిశెట్టి మమత, పట్టణ అధ్యక్షుడు కాశెట్టి తిరుపతి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సింగు అంజలి, అధికార ప్రతినిధి కడార్ల లావణ్య, సింగం పద్మ, ఉపాధ్యక్షులు గాదాసు రాజేందర్, ఇట్యాల రాము, చెన్నాడి మధురిమ, దురిశెట్టి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో రూ.16 లక్షల పనులపై విచారణ జరపాలి

మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ ఫిర్యాదు

**జగిత్యాల, సెప్టెంబర్ 30 (ప్రజా మంటలు):** జగిత్యాల పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటన సందర్భంగా చేపట్టిన పనుల్లో నిబంధనల ఉల్లంఘన జరిగిందని ఆరోపిస్తూ మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణానికి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో 4,520 ఇళ్లను నిర్మించగా, ఇప్పటివరకు సుమారు 4,320 ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. అయితే కాలనీలో ఇప్పటికీ రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి కనీస మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో లేవని పేర్కొన్నారు. కాలనీకి బస్సు సౌకర్యం, పోలీస్ స్టేషన్, పాఠశాల, ప్రత్యేక స్మశానవాటికలు కూడా లేవని, డంపింగ్ యార్డు సమీపంలో మృతదేహాలను దహనం చేయడం, చెత్తను తగులబెట్టడం వల్ల పొగ, కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జయశ్రీ ఫిర్యాదులో ఆరోపించారు. సుమారు 1,000 కుటుంబాలు నివసిస్తున్న ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని తెలిపారు.

## మంత్రి పర్యటనకు ముందు హడావుడిగా పనులు?

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగస్టు 21న కాలనీకి వస్తున్న



నేపథ్యంలో ఆగస్టు 19, 20 తేదీల్లో మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య వాహనాలతో హడావుడిగా పనులు చేపట్టారని జయశ్రీ ఆరోపించారు. ఈ పనులకు సుమారు రూ.16 లక్షలు ఖర్చు చేసినట్లు చూపించి, అనంతరం సాధారణ కౌన్సిల్ సమావేశం ఎజెండాలో చేర్చి బిల్లుల చెల్లింపునకు తీర్మానం చేయడం నిబంధనలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. కౌన్సిల్, కలెక్టర్ అనుమతులు లేకుండానే పనులు చేపట్టారనే ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని తేలితే బాధ్యులైన అధికారులపై చట్టపరమైన, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## మున్సిపల్ కమిషనర్‌పై కూడా ఆరోపణలు

మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత సాధారణ ప్రజలకు సంబంధించిన మోటేషన్లు, ఇంటి నంబర్ల కేటాయింపు, సెల్ఫ్ అసెస్‌మెంట్లు, జనన--మరణ ధ్రువపత్రాలు, భవన అనుమతులు వంటి పనుల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జయశ్రీ ఆరోపించారు. ప్రజలకు అవసరమైన సేవలను వేగంగా అందించకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ వ్యవహారాల్లో నిధుల వినియోగం, కాంట్రాక్టు పనులు, అదనపు ఎజెండాలపై కూడా సమగ్ర పరిశీలన అవసరమని ఆమె కోరారు. రూ.16 లక్షల ప్రజాధనం వినియోగంపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడానికి పూర్తి స్థాయి విచారణ జరిపి, తప్పిదాలు రుజువైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ కమిషనర్‌ను హనుమండ్ల జయశ్రీ కోరారు. ఈ ఫిర్యాదు ప్రతులను జగిత్యాల జిల్లా కలెక్టర్‌తో పాటు తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ డైరెక్టర్ జనరల్‌కు కూడా పంపినట్లు తెలిపారు.

# ఓటరు నమోదుపై దృష్టి సారించాలి

-మాజీమంత్రి మర్రి శశిధర్ రెడ్డి

-సనత్‌నగర్‌లో బీజేపీ సమీక్షా సమావేశాలు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 30 (ప్రజా మంటలు):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2) కార్యక్రమంపై బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మర్రి శశిధర్ రెడ్డి పిలుపునిచ్చారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో ఎస్ఐఆర్-2 పై ఇప్పటివరకు చేపట్టిన కార్యాచరణపై భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విస్తృత సమీక్షా సమావేశాలు నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో డివిజన్ల వారీగా ఈ సమావేశాలు కొనసాగాయి. ఉదయం సనత్‌నగర్‌లోని మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సనత్‌నగర్, బీకేగూడ డివిజన్ల సమీక్ష నిర్వహించగా, అనంతరం అమీర్‌పేట గురునానక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఎస్సార్ నగర్, అమీర్‌పేట డివిజన్ల సమావేశం జరిగింది. మధ్యాహ్నం మహంకాళి స్ట్రీట్‌లోని సిక్కు సమాజ్ భవనంలో రాంగోపాల్‌పేట్, మోండా డివిజన్ల నాయకులతో సమీక్ష చేపట్టారు. సాయంత్రం బన్సీలాల్‌పేట్ సీసీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో బన్సీలాల్‌పేట్, పద్మారావు నగర్ డివిజన్ల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, సవరణ ప్రక్రియలో మిగిలి ఉన్న ఈ వారం రోజుల్లో బీఎల్ఏలు మరింత చురుగ్గా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం నుంచి నోటీసులు అందుకున్న ఓటర్లు సకాలంలో సరైన పత్రాలు సమర్పించేలా సహాయపడాలని సూచించారు. అలాగే 18 ఏళ్లు నిండిన యువతను గుర్తించి, వారి పేర్లను కొత్త ఓటర్లుగా నమోదు చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహంకాళి--సికింద్రాబాద్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు సురేష్ కుమార్, డివిజన్ అధ్యక్షులు చంద్ర కుమార్, నరేష్, రజిత రెడ్డి, పవన్ కుమార్, సందీప్ వర్మ, ప్రశాంత్ జైన్, రామాంచ మహేష్, గుండు రఘురాంతో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకుడికి చేనేత పట్టు వస్త్రాల సమర్పణ

--ఆలయ ఆవరణలోనే వస్త్రాలను నేసిన సికింద్రాబాద్ వాసి



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 30 ( ప్రజామంటలు):** స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి అఖిల భారత చేనేత కళ వైభవం ఆధ్వర్యంలో బుధవారం పట్టు వస్త్రాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. సికింద్రాబాద్ కు చెందిన సంస్థ చైర్మన్, భక్తుడు ఎస్.ఎస్. జయరాజ్ నేతృత్వంలో ఆలయ ప్రాంగణంలోనే చేనేత మగ్గం వేసి, నియమ, నిష్ఠలతో నేసిన ఈ విశిష్ట పట్టు వస్త్రాలను ఆలయ ఈవో పెంచల కిషోర్, ఆలయ చైర్మన్ సురేంద్రబాబు, ధర్మకర్త సతీష్ కుమార్, ఇతర పాలకమండలి సభ్యుల సమక్షంలో వేద పండితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్. జయరాజ్‌తో పాటు పంచనూరి మురళీధర్ కుటుంబ సభ్యులు, నంది విశ్వనాథం, దొంతి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ కు చెందిన చేనేత కార్మికుడు ఇంత వరకు ప్రతి ఏటా భద్రాచలం సీతారాములోరి కళ్యాణం, యాదాద్రి ఉత్సవాలు, మహంకాళి జాతరలో అమ్మవార్లకు, సికింద్రాబాద్ గణేశ్ టెంపుల్ లో స్వామి వారికి, గోల్కొండ బోనాలు, బల్కంపేట ఎల్లమ్మ, జోగులాంబ శక్తిపీఠం, కొండగట్టు హన్మాన్ జయంతి, వరంగల్ భద్రకాళి దేవి శరన్నవ రాత్రోత్సవాల సందర్భంగా ప్రతి ఏటా ఆయా ఆలయాల్లోనే తన సొంత ఖర్చులతో మగ్గం ఏర్పాటు చేసి, అక్కడనే పట్టు వస్త్రాలను నేసి, ఆలయ దేవతలకు సమర్పించడం చాలా కాలంగా వస్తుంది. కాగా కాణిపాకంలో మొదటి సారిగా ఈ ఏడాది వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మగ్గంపై పట్టువస్త్రాలను నేసి, స్వామి వార్లకు సమర్పించినట్లు జయరాజ్ తెలిపారు.

# గొల్లపల్లి మండలం లోని పెన్షన్ దరఖాస్తులపై అధికారుల క్షేత్రస్థాయి విచారణపూర్తి

అర్హులు, అనర్హుల గుర్తింపు ఎంపీడీఓ రవీందర్ రావు



**గొల్లపల్లి సెప్టెంబర్ 30 ప్రజా మంటలు :** ప్రభుత్వం అమలు చేస్తున్న పెన్షన్ పథకంలో అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ప్రయోజనం అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా గొల్లపల్లి మండలం లోని గ్రామాల్లో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హత, అనర్హతలను పరిశీలించే ప్రక్రియనేటి తో పూర్తి ప్రభుత్వ ఆదేశాల మేరకు గొల్లపల్లి మండల ఎంపీడీఓ రవీందర్ రావు పలు గ్రామాల్లో పర్యటించి దరఖాస్తుదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నారా? లేదా? అనే అంశాలపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి సంబంధిత వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా పెన్షన్ పథకం ప్రయోజనాలు నిజమైన అర్హులకు చేరేలా పారదర్శకంగా పరిశీలన చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అర్హత ప్రమాణాలను ఉల్లంఘించిన దరఖాస్తులు గుర్తించిన పక్షంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. విచారణలో మండల ప్రత్యేక అధికారులు కార్యదర్శి లు పాల్గొన్నారు.

# విద్యార్థుల మాక్ పార్లమెంట్ నాలుగు బిల్లులకు ఆమోదం





**జగిత్యాల, సెప్టెంబర్ 30 (ప్రజా మంటలు):** జగిత్యాల జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని 16 పీఎం శ్రీ పాఠశాలలకు చెందిన 32 మంది విద్యార్థులు పాల్గొని స్పీకర్, మంత్రులు, అధికార, ప్రతిపక్ష సభ్యుల పాత్రలను పోషిస్తూ పార్లమెంటరీ విధానాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో, వాతావరణ మార్పులు--భారత్‌పై ప్రభావం, కృత్రిమ మేధస్సు (ఐూ×) ప్రభావం, ధరల పెరుగుదల, ఎన్నికల సంస్కరణలు వంటి సమకాలీన అంశాలపై విద్యార్థులు చర్చించారు. అనంతరం నాలుగు బిల్లులను సభలో ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎల్‌బీ రాజా గౌడ్ మాట్లాడుతూ సమకాలీన అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని, మాక్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంచుతాయని అన్నారు. డీఈఓ కె. రాము విద్యార్థుల ప్రదర్శనను అభినందిస్తూ, జాతీయ, అంతర్జాతీయ అంశాలపై వారు తార్కికంగా, ధైర్యంగా మాట్లాడటం ప్రశంసనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు మహేష్, నీరజ, జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు జోగరవి, ప్రధాన కార్యదర్శి దాసరి రామస్వామి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులతో పాటు గైడ్ టీచర్లను అధికారులు అభినందించారు.

# జగిత్యాల అభివృద్ధికి సమష్టి కృషి చేయాలి





**జగిత్యాల, సెప్టెంబర్ 30 (ప్రజా మంటలు):** జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి సభ్యులు, పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని సంఘం ౫×జ/అధ్యక్షుడు పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి అన్నారు. సంఘ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సంఘం ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, సభ్యులకు అందిస్తున్న రుణ సదుపాయాలు, రుణాల వసూళ్లు, ఆదాయ--వ్యయాలు, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌ను పరిశీలించి, ఆదాయ--వ్యయాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని నిర్ణయించారు. వాయిదా మీరిన రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి .. సంఘం ఆర్థిక పరిపుష్టికి రుణాల సకాలంలో వసూళ్లు కీలకమని సభ్యులు పేర్కొన్నారు. బకాయిలను నిర్ణీత గడువులోగా చెల్లించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, నిర్లక్ష్యం చేసే వారి విషయంలో సంఘ నిబంధనల ప్రకారం, చట్టరీత్యా చర్యలు చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సభ్యుల ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని 12 మంది సభ్యులకు రూ.10.99 లక్షల స్వల్పకాలిక రుణాలను మంజూరు చేశారు. సంఘ సేవలను సభ్యులు సద్వినియోగం చేసుకుని, తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. సంఘ కార్యకలాపాలను బలోపేతం చేయడం, సభ్యులకు సేవలను మెరుగుపరచడం, రుణాల వసూళ్లను వేగవంతం చేయడం, ఆర్థిక క్రమశిక్షణ పాటించడం తదితర అంశాలపై సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ౫×జ సభ్యులు అల్లాల రమేష్ రావు, బేతి రాజవ్వ లక్ష్మి రెడ్డి, ముప్పారపు దేవమ్మ, నీలం లక్ష్మి నర్సయ్య, తోట గంగరాజం, కొక్కుల శంకరయ్య, కార్యదర్శి గాజెంగి వేణు, సిబ్బంది బోయిని రాజేష్, అది మల్లేశం, కొక్కుల నవీన్, ఇట్టే సుమన్, పోతుగంటి అజయ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీలు

**జగిత్యాల, సెప్టెంబర్ 30 (ప్రజా మంటలు):** జగిత్యాల జిల్లాలో నలుగురు సబ్‌ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. జోన్-2 బాసర డీఐజీ ఆదేశాల మేరకు పరిపాలనా అవసరాలు, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తక్షణమే బదిలీలు అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎస్. శ్రీకాంత్ -- డీఎస్‌బీ, జగిత్యాల నుంచి బుగ్గారం ఎస్‌హెచ్‌ఓగా నియామకం. నార్మల్ జిల్లాకు బదిలీ ఉత్తర్వులు రద్దు. గొంగటి సతీష్ -- బుగ్గారం ఎస్‌హెచ్‌ఓ నుంచి నార్మల్ జిల్లాకు వీఆర్ (వేకెన్సీ రిజర్వ్). కె. కుమారస్వామి -- డీఎస్‌బీ, జగిత్యాల నుంచి పెగడపల్లి ఎస్‌హెచ్‌ఓగా నియామకం. ఈ. కిరణ్‌కుమార్ -- పెగడపల్లి ఎస్‌హెచ్‌ఓ నుంచి జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ-1గా బదిలీ. బదిలీ అయిన అధికారులు వెంటనే విధుల్లో చేరాలని, రిలీవ్, రిపోర్టింగ్ తేదీలను జిల్లా పోలీస్ కార్యాలయానికి తెలియజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## సీఎం పర్యటన పేరుతో ప్రజా గొంతుకను అణచివేయడం సరికాదు



**జగిత్యాల, సెప్టెంబర్ 30 (ప్రజా మంటలు):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన సందర్భంగా జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడాన్ని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆమెను ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. సీఎం పర్యటనలకు భద్రత కల్పించడం పోలీసుల బాధ్యతేనని, అయితే ఆ పేరుతో రాజకీయ నాయకులను ముందస్తుగా నిర్బంధించడం, వారి సాధారణ కార్యక్రమాలను అడ్డుకోవడం సరైన విధానం కాదని జీవన్‌రెడ్డి అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వారిని కలుసుకోవడం ప్రతి నాయకుడి హక్కు అని పేర్కొన్నారు. సిరిసిల్ల పర్యటనలో కాంగ్రెస్ నాయకులకు ఒక నీతి, తమకు మరో నీతా అని ప్రశ్నించారు. ప్రజల సమస్యలపై మాట్లాడే వారిని నిర్బంధించడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. నేతన్నల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన జీవన్‌రెడ్డి, తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్, కేటీఆర్ హయాంలో సిరిసిల్లలో చేనేత రంగానికి ప్రాధాన్యం లభించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. సిరిసిల్లలో కేటీఆర్ చేసిన అభివృద్ధిని చూసి సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌ను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. సీఎం ఎన్ని సభలు నిర్వహించినా కేటీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని చెరపలేరని, కేసీఆర్‌ను ప్రజల గుండెల్లో నుంచి తొలగించడం ఎవరి వల్లా కాదని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై దావ వసంత సురేష్ చేస్తున్న పోరాటాన్ని ఎలాంటి నిర్బంధాలు, ఆంక్షలు అడ్డుకోలేవని ఆమె స్పష్టం చేశారు.

# రూ.10 కోట్లు దోపిడీ ఇంకా కావాలని అడగడంతో వెలుగులోకి సైబర్ నేరం



తాజాగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో విజయవాడలో ఓ వృద్ధుడిని బెదిరించి ఏకంగా రూ.10 కోట్లు దోచుకున్నారు. ఈ భారీ సైబర్ మోసం ఎన్టీఆర్ జిల్లాలో కలకలం రేపుతోంది. సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథాలో రెచ్చిపోతున్నారు. తాజాగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో విజయవాడలో ఓ వృద్ధుడిని బెదిరించి ఏకంగా రూ.10 కోట్లు దోచుకున్నారు. ఈ భారీ సైబర్ మోసం ఎన్టీఆర్ జిల్లాలో కలకలం రేపుతోంది. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు.విజయవాడలోని గురునానక్ కాలనీకి చెందిన ఓ విశ్రాంత ఇంజినీర్‌కు వారం రోజుల కిందట ఓ ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తులు తాము పోలీసులమని గంభీరంగా పరిచయం చేసుకున్నారు. బాధితుడి వివరాలను ఉపయోగించి, మీపై కేసులు ఉన్నాయని, విచారణలో భాగంగా 'డిజిటల్ అరెస్ట్' చేస్తున్నామని బెదిరించారు. ఈ కేసుల నుంచి బయటపడాలంటే తాము అడిగినంత డబ్బు ఇవ్వాలని భయాందోళనలకు గురిచేశారు. వారి మాటలు నమ్మిన ఆ వృద్ధుడు ఆందోళనకు గురయ్యాడు.నాలుగు లావాదేవీల్లో పది కోట్లు బదిలీ : సైబర్ కేటుగాళ్ల బెదిరింపులకు భయపడిన విశ్రాంత ఇంజినీర్ వారు అడిగినంత డబ్బు ఇచ్చేందుకు అంగీకరించారు. కృష్ణలంకలోని కెనరా బ్యాంక్ బ్రాంచ్‌లో ఉన్న తన ఖాతా నుంచి నేరగాళ్లు చెప్పిన రెండు వేర్వేరు బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేశారు. ఇలా ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా నాలుగు లావాదేవీల్లో పది కోట్ల రూపాయల భారీ మొత్తాన్ని బాధితుడు ఆ ఖాతాల్లో డిపాజిట్ చేశాడు.మరింత డిమాండ్ : అతి సులువుగా రూ.10 కోట్లు దోచుకున్నప్పటికీ సైబర్ కేటుగాళ్ల దాహం తీరలేదు. బాధితుడిని మరింతగా భయపెట్టి ఇంకొంత నగదు జమ చేయాలని మళ్లీ డిమాండ్ చేశారు. పదే పదే డబ్బులు అడుగుతుండటంతో ఆ వృద్ధుడికి వారి వ్యవహారంపై అనుమానం వచ్చింది. వెంటనే అప్రమత్తమైన ఆయన, తాను సైబర్ మోసానికి గురయ్యానని గ్రహించి విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. తనకు జరిగిన మోసాన్ని వివరిస్తూ ఫిర్యాదు చేశారు.రూ.7 కోట్లు ఫ్రీజ్ చేసిన పోలీసులు : రూ.10 కోట్ల భారీ మోసం జరగడంతో సైబర్ క్రైమ్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఫిర్యాదు అందిన వెంటనే బాధితుడి నివాసానికి చేరుకుని పూర్తి వివరాలు సేకరించారు. నేరగాళ్లు నగదు బదిలీ చేయించుకున్న బ్యాంకు ఖాతాల వివరాలను ఆరా తీశారు. సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా స్పందించి, ఆ ఖాతాల్లో ఉన్న రూ.7 కోట్ల నగదును ఫ్రీజ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, కేటుగాళ్ల మూలాలను పట్టుకునేందుకు లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

# సామాన్యులకు తీపికబురు రైతుబజార్లలో రూ.35కే కిలో ఉల్లి

ధరల స్థిరీకరణలో భాగంగా సబ్సిడీ ధరకు ఉల్లిపాయలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైతు బజార్లలో కిలో ఉల్లిపాయలను కేవలం రూ. 35కే విక్రయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మార్కెట్లో ఉల్లి ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సామాన్యులకు తీపికబురు అందించింది. ధరల స్థిరీకరణలో భాగంగా సబ్సిడీ ధరకు ఉల్లిపాయలను అందించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. రైతు బజార్లలో కిలో ఉల్లిపాయలను కేవలం రూ. 35కే విక్రయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.సబ్సిడీ ఉల్లి విక్రయాలను తొలి దశలో విజయవాడ నగరంలో అమలు చేయనున్నారు. రేపటి నుంచి నగరంలోని అన్ని రైతుబజార్లలో ఈ విక్రయాలు ప్రారంభం కానున్నాయి. విజయవాడలోని ఏపీఐఐసీ రైతుబజార్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.కొనుగోలుకు నిబంధనలు ఇవే : సబ్సిడీ ఉల్లిపాయలు కొనుగోలు చేసేందుకు వినియోగదారులకు ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఉల్లి కోసం వచ్చే వారు తమ వెంట తప్పనిసరిగా ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు తీసుకురావాల్సి ఉంటుంది. ఈ కార్డుల ఆధారంగా ప్రతి కుటుంబానికి నెలకు గరిష్ఠంగా రెండు కిలోల ఉల్లిపాయలను మాత్రమే రూ. 35 చొప్పున విక్రయిస్తారు. బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టి, నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఈ ప్రయోజనం చేకూర్చేందుకే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. బహిరంగ మార్కెట్లో అధిక ధర పలుకుతున్న బీపీటీ సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని, ప్రత్యేక కౌంటర్లలో రూ.52-50 లకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు.త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు ప్రస్తుతం విజయవాడకే పరిమితమైన ఈ సబ్సిడీ ఉల్లి పంపిణీని త్వరలో మిగతా ప్రాంతాలకు విస్తరించనున్నారు. ప్రజల నుంచి వచ్చే డిమాండ్‌ను బట్టి, దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రైతు బజార్లలోనూ సబ్సిడీ ఉల్లిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. కూరగాయల మార్కెట్లో ఉల్లి ధరల భారాన్ని సామాన్యుడిపై పడకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన



లక్ష్యమని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధరల స్థిరీకరణ నిధిని ఉపయోగించి పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కల్పిస్తున్న ఈ సబ్సిడీ ఉల్లి సదుపాయాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు.

# 'సర్'లో నోటీసులకు సమాధానం 48,88,076 మంది తుది జాబితాకు అర్హులే

తెలంగాణ ఎస్ఐఆర్‌లో 48,88,076 మంది ఓటర్లు నోటీసులకు ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా ఉండటంతో వారి పేర్లను తుది జాబితాకు అర్హులుగా ఎన్నికల అధికారులు తేల్చారు.తెలంగాణలో ఇప్పటివరకు 48,88,076 మంది ఓటర్లు నోటీసులకు ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా ఉండటంతో వారి పేర్లను తుది జాబితాలో ప్రచురణకు అర్హులుగా ఎన్నికల అధికారులు తేల్చారు. మరో 12,99,368 మంది ఓటర్ల నోటీసుల సమాధానంపై అధికారులే నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుతం వీటిపై జిల్లా ఎన్నికల అధికారి (డీఈవో) స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సాధారణంగా ఓటర్ల నోటీసులకు ఈఆర్వో, ఏఈఆర్వో స్థాయిలో విచారణ చేపట్టి పరిష్కారాలు చేస్తున్నారు.

### 12.99 లక్షల ఓటర్ల నోటీసులపై విచారణ

సర్ నోటీసుల విచారణ సమయంలో ఓటర్లు సమర్పించిన ధ్రువపత్రాల్లో అనుమానాలున్నా, ఇతర సందేహాలు వస్తున్నా, వీటిపై జిల్లా ఎన్నికల అధికారుల స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం 12.99 లక్షల ఓటర్ల నోటీసులపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపడుతున్నారు. రాష్ట్రంలో సర్‌లో భాగంగా ఇప్పటివరకు 92,88,180 ఓటర్ల నోటీసుల జాబితాను ఎన్నికల సంఘం రూపొందించింది. ఇందులో 88,52,173 మందికి నోటీసులు అందించగా మరో 4,36,007 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. మొత్తం నోటీసులు అందుకున్న ఓటర్లలో విచారణకు



ఇప్పటివరకు 61,87,444 మంది హాజరయ్యారు. ఈ మేరకు ఎన్నికల సంఘం ప్రధాన అధికారి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

### చిన్నచిన్న తప్పులకు బీఎల్‌వో స్థాయిలోనే పరిష్కారం

రాష్ట్రంలో నోటీసులందుకున్న ఓటర్ల ఇళ్లకు, బూత్ లెవల్ ఆఫీసర్లు వెళ్తున్నారు. మొత్తం 11 రకాల అనామలీస్ జాబితాలో చిన్న చిన్న పొరపాట్లు ఉన్నా, ఓటర్ల వివరాల్లో బీఎల్‌వో స్థాయిలోనే పరిష్కరిస్తున్నారు. ఓటర్ల వద్దనున్న గుర్తింపు కార్డుల ఆధారంగా వివరాలు సేకరించి ఈఆర్వో/ఏఆర్వో ముందు విచారణకు హాజరుకాకుండానే సమస్యను వేగంగా పరిష్కరిస్తున్నారు. అన్-మ్యాపింగ్ నోటీసులకు మాత్రం ఎన్నికల సంఘం వయస్సుల వారీగా సూచించిన ఐడీ కార్డులను తప్పనిసరిగా చూపించాల్సి వస్తోంది. ఇలా నోటీసు ప్రక్రియలో అసాధారణ సందేహాలు వ్యక్తమైతే వాటి నిర్ణయం డీఈవో స్థాయి వరకు వెళ్లి నిర్ణయం తీసుకుంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు సడలించడంతో నోటీసుల విచారణ ప్రక్రియ మరింత వేగవంతమైంది.

### సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలో నిరాశ్రయ కేంద్రాల్లో నివాసం ఉంటున్న ప్రజలు, కూలీలు, పేదలు, కార్మికులు, వివిధ పనులపై ఆధారపడి జీవిస్తున్న వారి కోసం ప్రత్యేక శిబిరాలు, సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మార్గదర్శకాల్లో ఎన్నికల సంఘం వెల్లడించింది. కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు సమర్పించాల్సిన ఫారం-6 పైన కూడా స్పష్టత ఇచ్చింది.

### ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు

'సర్' ప్రక్రియకు సంబంధించిన కాలమ్‌లో కాకుండా సాధారణ కాలమ్‌లో అందించే దరఖాస్తులకు 1950 నాటి ఎన్నికల రిజిస్ట్రేషన్ నిబంధనలు వర్తిస్తాయని వెల్లడించింది. ఈ సంవత్సరం అక్టోబరు 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులని ఎన్నికల కమిషన్ పేర్కొంది. వీరంతా ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

# ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కల్కి భగవాన్ కన్నుమూత

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కల్కి భగవాన్ కన్నుమూశారు. తీవ్ర అస్వస్థతకు గురై పదిరోజులుగా చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మ. 3 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు ట్రస్టు ప్రతినిధులు ప్రకటించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కల్కి భగవాన్ కన్నుమూశారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన గత పది రోజులుగా చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న (మంగళవారం) మధ్యాహ్నం మూడు గంటలకు తుదిశ్వాస విడిచినట్లు ట్రస్టు ప్రతినిధి తెలిపారు. భగవాన్ కుమారుడైన కృష్ణాజీతో పాటు ఆశ్రమానికి (ఏకం ట్రస్టు) చెందిన దాసాజీలు, ప్రతినిధులు చెన్నైలోని ఆసుపత్రి వద్ద ఉన్నారు. నేడు (బుధవారం) ఉదయం 11 గంటలకు తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలం బత్తులవల్లంలోని ఏకం ఆలయాని (గోల్డెన్ సిటీ)కి కల్కి భగవాన్ పార్థివదేహాన్ని తరలించనున్నట్లు తెలిపారు.

### శనివారం అంత్యక్రియలు

ప్రజల సందర్శనార్థం పార్థివదేహాన్ని ఇక్కడే ఉంచనున్నారు. ఆలయంలోనే కల్కి భగవాన్ అంత్యక్రియలను శనివారం నిర్వహించేందుకు, సమాధి నిర్మాణానికి పనులు సాగుతున్నాయి. సతీమణి అమ్మ భగవాన్‌తో కలిసి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించిన కల్కి భగవాన్‌కు ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్నారు. ఏకం ఆలయాన్ని రూ.200 కోట్లతో పాలరాతితో నిర్మించారు.

### కల్కి భగవాన్ పేరుతో ప్రపంచానికి పరిచయం

విజయ్‌కుమార్ పేరుతో ఎల్ఐసీ ఏజెంటుగా, ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన 1992లో తాను కల్కి అవతారమంటూ కల్కి భగవాన్ పేరుతో ప్రపంచానికి పరిచయమయ్యారు. తొలుత కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురంలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి ఆపై తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు సమీపంలో నేమం ప్రాంతంలో కల్కి భగవాన్‌గా ఆధ్యాత్మిక బోధనలు చేశారు.

### పలు ట్రస్టులు ఏర్పాటు



ఆపై వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురంలో కల్కి గ్రామీణాభివృద్ధి ట్రస్టు పేరుతో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆశ్రమాల్లో విదేశీ భక్తులతో పాటు, దేశం నలుమూలల నుంచి వచ్చే వారికి ధ్యానం, ముక్తి దీక్ష తదితర ఆధ్యాత్మిక తరగతులు నిర్వహించేవారు. కల్కి గ్రామీణాభివృద్ధి, వన్నెస్ హ్యూమన్, లోకా ఫౌండేషన్, ముక్తి తదితరాల పేరిట ట్రస్టులు ఏర్పాటు చేశారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు: అభ్యర్థులను ప్రకటించిన తెలంగాణ కాంగ్రెస్

## సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి పేర్లు ఖరారు

## ఇప్పటికే ప్రారంభమైన ఓటర్ల నమోదు ప్రక్రియ

## అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలన్న కేటీఆర్



తెలంగాణలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గానికి సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని బరిలోకి దింపుతున్నట్టు మంగళవారం రాత్రి వెల్లడించింది.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ పేర్లను ఆమోదించారని, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారని పార్టీ వర్గాలు తెలిపాయి. 2027 మార్చిలో ఖాళీ అవుతున్న ఈ రెండు స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.ఈ ఎన్నికల కోసం ఓటర్ల నమోదు ప్రక్రియ సోమవారం నుంచే ప్రారంభమైన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి కోరారు. నవంబర్ 1, 2026 నాటికి డిగ్రీ లేదా తత్సమాన డిప్లొమా పూర్తి చేసి కనీసం మూడేళ్లు దాటిన వారు ఓటు హక్కు నమోదుకు అర్హులు. గతంలో ఓటు హక్కు ఉన్నవారు కూడా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.మరోవైపు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సోమవారం హైదరాబాద్‌లో తన ఓటును నమోదు చేసుకున్నారు. అర్హులైన పట్టభద్రులందరూ నవంబర్ 6 లోగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని, ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను, డిసెంబర్ 30న తుది జాబితాను ప్రచురించనున్నారు.

# విశాఖలో రూ.11,498 కోట్లతో 'డబుల్ డెక్కర్' మెట్రో

## ఏపీ బీజేపీ ఎక్స్ వేదికగా ప్రకటన



మోదీ ప్రభుత్వ పూర్తి మద్దతుతో విశాఖలో వినూత్నమైన 'డబుల్ డెక్కర్ మెట్రో' ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ బీజేపీ శాఖ ఎక్స్ వేదికగా వెల్లడించింది. విశాఖపట్నంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మరో కీలక అడుగు పడింది. మోదీ ప్రభుత్వ పూర్తి మద్దతుతో విశాఖలో వినూత్నమైన 'డబుల్ డెక్కర్ మెట్రో' ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ బీజేపీ శాఖ ఎక్స్ వేదికగా వెల్లడించింది.ఒకే పిల్లర్‌పై ఫ్లైఓవర్, మెట్రో : ఈ ప్రాజెక్టును అధునాతన సాంకేతికతతో నిర్మించనున్నారు. భూసేకరణ, స్థల సమస్యలను అధిగమించేలా ఒకే పిల్లర్‌పై కింద ఫ్లైఓవర్, దానిపై భాగంలో మెట్రో రైలు వెళ్లేలా డబుల్ డెక్కర్ వ్యవస్థను రూపొందిస్తున్నారు. ఒకే పిల్లర్‌పై ఈ రెండు మార్గాలను తీసుకురావడం ద్వారా వైజాగ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సరికొత్త బాటలు వేస్తోందని ఏపీ బీజేపీ తన 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది.తొలి దశకు రూ.11,498 కోట్లు : విశాఖ డబుల్ డెక్కర్ మెట్రో తొలి దశ (ఫేజ్ వన్) పనుల కోసం ముమ్మరంగా ప్రణాళికలు సిద్ధమయ్యాని బీజేపీ తెలిపింది. ఈ ఫేజ్ వన్ ప్రాజెక్టును ఏకంగా రూ.11,498 కోట్ల అంచనా వ్యయంతో వేగంగా ముందుకు తీసుకువెళ్లేలా కేంద్రం నుంచి ఆమోదం లభించిందని రాష్ట్ర బీజేపీ వివరించింది. ఈ వినూత్న ప్రాజెక్టు పట్టాలెక్కితే ప్రయాణికులకు మెరుగైన రవాణా సదుపాయం లభించడంతో పాటు విశాఖ నగర రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని పేర్కొంది.

# హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మరో అంతర్జాతీయ సర్వీస్

## హైదరాబాద్ నుంచి తాష్కెంట్‌కు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభం

## సెంట్రమ్ ఎయిర్ ఆధ్వర్యంలో వారానికి రెండుసార్లు నడవనున్న విమానాలు

## దక్షిణ భారతదేశం, మధ్య ఆసియాను కలిపే తొలి డైరెక్ట్ సర్వీస్ ఇదే

## మొత్తం 27 అంతర్జాతీయ గమ్యస్థానాలకు చేరిన హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నెట్‌వర్క్




ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్‌కు హైదరాబాద్ (శంషాబాద్) నుంచి నేరుగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. 'సెంట్రమ్ ఎయిర్' సంస్థ మంగళవారం నుంచి ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. వారానికి రెండుసార్లు ఈ సర్వీసులు నడవనున్నాయి. ఈ నూతన సర్వీసుతో దక్షిణ భారతదేశం, మధ్య ఆసియా మధ్య ప్రత్యక్ష విమాన అనుసంధానం ఏర్పడింది.ఈ విమాన సర్వీసుల ప్రారంభ కార్యక్రమంలో జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రతినిధి కదిర్ కదిర్వన్, ఏరోప్రైమ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ అభిషేక్ గోయల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కదిర్ కదిర్వన్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం ఒక ప్రముఖ మెడికల్ టూరిజం కేంద్రంగా ఎదుగుతున్న తరుణంలో, ఈ కొత్త అంతర్జాతీయ సర్వీసులు ప్రయాణికులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు.తాష్కెంట్‌తో కలిపి హైదరాబాద్ విమానాశ్రయం నుంచి ప్రస్తుతం మొత్తం 27 అంతర్జాతీయ గమ్యస్థానాలకు విమాన సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక దేశీయంగా 74 నగరాలకు విమాన రాకపోకలు సాగుతున్నాయి. ఈ కొత్త మార్గం ద్వారా వాణిజ్య, పర్యాటక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని విమానాశ్రయ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక జోక్యం కుదరదు: హైకోర్టు స్పష్టీకరణ

## టీజీ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల గుర్తుపై వివాదం

## తమకు నిచ్చెన గుర్తు కేటాయించడాన్ని సవాలు చేసిన మజ్దూర్ యూనియన్

## ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు




సంబంధిత పిటిషన్‌ను కొట్టివేసిన జస్టిస్ శ్రీదేవి ధర్మాసనంతెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల గుర్తు కేటాయింపు వివాదంలో జోక్యం చేసుకునేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. ఈ మేరకు దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం మంగళవారం కొట్టివేసింది.టీజీఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో గతంలో తమకు ఉన్న 'విల్లు-బాణం' గుర్తుకు బదులుగా 'నిచ్చెన' గుర్తును కేటాయించడాన్ని సవాలు చేస్తూ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పి. శ్రీదేవి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైనందున, ఈ దశలో గుర్తుల కేటాయింపు వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాత న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడం సమంజసం కాదని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది.

# డేటింగ్ యాప్ మోసం

# జూబ్లీహిల్స్ పబ్‌లో యువకుడికి రూ. 29,000 బిల్లు!

## డేటింగ్ యాప్‌లో పరిచయమైన యువతితో డేట్‌కు వెళ్లిన యువకుడు

## జూబ్లీహిల్స్ పబ్‌లో రూ. 29,000 బిల్లు వేసి వసూలు

## పబ్ యాజమాన్యంతో యువతి కుమ్మక్కైందని బాధితుడి ఆరోపణ

## బాధితుడు హేమంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు



హైదరాబాద్‌లో ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌ల ముసుగులో జరుగుతున్న మోసాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. డేటింగ్ యాప్ ద్వారా పరిచయమైన ఓ యువతితో కలిసి డేట్‌కు వెళ్లిన యువకుడు, ఏకంగా రూ. 29,000 బిల్లు చెల్లించాల్సి రావడంతో దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఈ ఘటన నగరంలోని జూబ్లీహిల్స్‌లో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే, హేమంత్ అనే యువకుడికి 'క్వాక్-క్వాక్' అనే డేటింగ్ యాప్ ద్వారా దివ్య అనే యువతి పరిచయమైంది. వీరిద్దరూ జూబ్లీహిల్స్‌లోని '36 కెమిస్ట్రీ' పబ్‌లో కలుసుకున్నారు. అయితే, అక్కడ గడిపిన కొద్దిసేపటికే పబ్ యాజమాన్యం రూ. 29,000 బిల్లు వేసిందని హేమంత్ ఆరోపిస్తున్నాడు.ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హనీట్రాప్ అని, సదరు యువతి పబ్ యాజమాన్యంతో చేతులు కలిపి తనను మోసం చేసిందని హేమంత్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై బాధితుడు వెంటనే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హేమంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున పూర్తి వివరాలు వెల్లడించడానికి పోలీసులు నిరాకరించారు. ఈ ఉదంతంతో డేటింగ్ యాప్‌ల వినియోగదారుల్లో మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com